చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు. చిత్రంలో పార్టీ సెక్రటరీ జనరల్, రాజ్యసభ సభ్యుడు కే కేశవరావు, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, పట్నం మహేందర్‌రెడ్డి, దయానంద్ గుప్తా, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, అరికెపూడి గాంధీ, సబితా ఇంద్రారెడ్డి, కడియం శ్రీహరి, ప్రకాశ్‌గౌడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, పైలట్ రోహిత్‌రెడ్డి, తీగల కృష్ణారెడ్డి తదితరులు

తెలంగాణకు బీఆరెస్సే రక్ష

- పార్లమెంట్‌లో తెలంగాణం వినిపించేది బీఆర్ఎస్ ఒక్కటే
- కాంగ్రెస్, బీజేపీలకు తెలంగాణ ప్రయోజనాలు అంశమే కాదు
- లోక్‌సభ ఎన్నికల్లో సమన్వయంతో ముందుకు సాగుదాం
- పార్టీ శ్రేణులకు హరీశ్‌రావు పిలుపు
- మన శక్తి చిన్నది కాదు: పోచారం
- కాంగ్రెస్ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి : కడియం శ్రీహరి
- తెలంగాణ భవన్‌లో చేవెళ్ల లోక్‌సభ సెగ్మెంట్ సమీక్ష

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్‌లో తెలంగాణ గళాన్ని బలంగా వినిపించి, రాష్ట్ర ప్రయోజనాలను కాపాడేది బీఆర్ఎస్ ఒక్కటేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. పార్లమెంట్‌లో కాంగ్రెస్, బీజేపీకి తెలంగాణ అనేది ఒక అంశమే కాదని తెలిపారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో చేవెళ్ల లోక్‌సభ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోని ప్రజాప్రతినిధులు, పార్టీ ప్రతినిధులతో సమావేశం జరిగింది. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ శ్రేణులు అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. రాష్ట్ర సాధనే ధ్యేయంగా ఏర్పాటైన బీఆర్ఎస్ తెలంగాణ సాధన దశలో అనేక ఎత్తుపల్లాలను చవిచూసిందని, అందులో ఎన్నికల్లో గెలుపు ఓటములు ఒక భాగమని హరీశ్‌రావు అన్నారు. కేసీఆర్ నాయకత్వంలో దేశం గర్వపడే రీతిలో అన్ని రంగాల్లో అద్భుత ఫలితాలు సాధించామని పేర్కొన్నారు.

సమన్వయంతో ముందుకు సాగుదాం

చేవెళ్ల పార్లమెంట్ పరిధిలోని పార్టీ శ్రేణులు ఎవరికివారు ద్విగుణీకృత ఉత్సాహంతో ముందుకు సాగాలని హరీశ్‌రావు పిలుపునిచ్చారు. తప్పులు పునరావృతం కాకుండా అన్నిస్థాయిల నాయకులు, కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగితే బీఆర్ఎస్‌దే విజయమన్నారు. సొంతపార్టీకి నష్టం చేసేవారిని గుర్తించి క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని నాయకులు సూచించారు. తాండూరు, పరిగి, వికారాబాద్‌లో బీఆర్ఎస్ అభ్యర్థులు ఓడిపోవడానికి కారణాలను లోతుగా విశ్లేషించుకొని ముందుకు సాగాలని చెప్పారు. మళ్లీ సీఎంగా కేసీఆరే ఉండాలని రాష్ట్రవ్యాప్తంగా స్థిరమైన అభిప్రాయం ఉన్నా పార్టీ అభ్యర్థులు ఎందుకు ఓడిపోయారనేది సమీక్షించుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. చెవేళ్ల సెగ్మెంట్‌లో బీజేపీకి బీఆర్ఎస్‌కు మధ్య 22 శాతం ఓట్ల తేడా ఉన్నదని, ఈ నేపథ్యంలో లోక్‌సభ ఎన్నికల్లో పోటీ కచ్చితంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్యనే ఉంటుందని అన్నారు.

పిలిస్తే పలికే ఎంపీ రంజిత్‌రెడ్డి

చేవెళ్ల పార్లమెంట్ చరిత్రలో ఎంపీ రంజిత్ రెడ్డి పిలిస్తే పలికే నాయకుడిగా పేరు తెచ్చుకున్నారని సమావేశంలో పార్టీ శ్రేణులు అభిప్రాయపడ్డాయి. అన్ని వర్గాలకు, అన్ని స్థాయిల వారికి అందుబాటులో ఉంటూ తలలో నాలుకలా వ్యవహరించారని ప్రశంసించారు. ప్రత్యర్థి పార్టీల కార్యకర్తలు సైతం బీఆర్ఎస్ పార్టీకే అనుకూలంగా ఉన్నారని వివరించారు. పార్టీ క్యాడర్ బలం, కేసీఆర్ నాయకత్వం చేవెళ్లకు శ్రీరామరక్ష అని పేర్కొన్నారు. మరోసారి చెవేళ్ల లోక్‌సభ స్థానంపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిప్రాయపడ్డారు.

మన శక్తి చిన్నది కాదు: మాజీ స్పీకర్ పోచారం

అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి బీఆర్ఎస్ అధికారం కోల్పోయినంత మాత్రాన పార్టీ శ్రేణులు ఎక్కడా చిన్నబుచ్చుకోవాల్సిన అవసరం లేదని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్రంలోని అన్ని పార్లమెంట్ నియోజకవర్గాల్లో స్థానిక సంస్థల బలంతోపాటు పార్టీ శ్రేణుల కార్యదక్షతను ప్రదర్శించాల్సిన సమయం ఆసన్నమైందని తెలిపారు. రాజకీయాల్లో గెలుపు ఓటములు సహజమని పేర్కొన్నారు. తప్పిదాలు పునరావృతం కాకుండా జాగ్రత్తపడ్డవారే రాజకీయాల్లో, జీవితంలో ఉన్నతస్థితికి వస్తారని చెప్పారు. చిన్నచిన్న అంశాలను బూచిగా పెట్టుకొని పార్టీకి నష్టం చేయాలని చూడటం ఎవరికీ మంచిది కాదని హితవు పలికారు.

కలిసికట్టుగా పనిచేస్తాం: సబితా ఇంద్రారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి

చేవెళ్ల లోకసభ స్థానంపై మరోసారి గులాబీ జెండాను ఎగురవేసేందుకు కలిసికట్టుగా పని చేద్దామని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రయోజనాలకు ఎన్నటికైనా బీఆర్ఎస్ పార్టీయే రక్ష అని తెలిపారు. అందరం కలిసికట్టుగా పనిచేసి మరోసారి రంజిత్ రెడ్డిని ఎంపీగా గెలిపిస్తామని ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి చెప్పారు. బీఆర్ఎస్ పాలనలో చేవెళ్ల లోక్‌సభ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభివృద్ధి జరిగిందని ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, కాలె యాదయ్య, ప్రకాశ్‌గౌడ్ పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ కే కేశవరావు, నేతలు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, సిరికొండ మధుసూదనాచారి, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీలు యెగ్గె మల్లేశం, దయానంద్, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్‌రెడ్డి, మెతుకు ఆనంద్, పైలట్ రోహిత్‌రెడ్డి, జీహెచ్ఎంసీ మాజీ మేయర్ తీగల కృష్ణారెడ్డి, జడ్పీ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: కడియం శ్రీహరి

ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అనేక వాగ్దానాలు చేసిందని, వాటిని నిత్యం ప్రజలకు గుర్తుచేయాల్సిన బాధ్యత బీఆర్ఎస్ పార్టీ శ్రేణులపైనే ఉన్నదని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ప్రజలకు వాగ్దానాలు ఇచ్చేముందు సచివాలయంలో లంకెబిందెలు ఉండవనే కనీస స్పృహ లేకుండా మాట్లాడి కాంగ్రెస్ అభాసుపాలైందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ పార్టీ పాలనను ప్రజలు గమనిస్తున్నారని, ప్రతీ అంశంలో తొమ్మిదిన్నర దెండ్ల కేసీఆర్ పాలనతో సరిపోల్చి చూస్తున్నారని చెప్పారు. రాజకీయాల్లో గెలిచినా ఓడినా ప్రజల పక్షాన పనిచేసిన వాళ్లనే ప్రజలు శాశ్వతంగా గుర్తుంచుకుంటారని తెలిపారు.

రైతుబంధు ఏమాయె?

డిసెంబర్ 9 లోపే వేస్తామని.. ఈ మోసమేంది? • రైతుబంధు కోసం మేం సిద్ధంచేసిన డబ్బు ఏమైంది?

మాపై ఒంటికాలిపై లేచిన మేధావులు ఇప్పుడెక్కడ? • రైతులను అవమానించిన కాంగ్రెస్ సర్కార్: నిరంజన్‌రెడ్డి

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌దే గెలుపు: రంజిత్‌రెడ్డి • ఓటర్లను మోసం చేసిన కాంగ్రెస్: మధుసూదనాచారి

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): రైతులను అవమానించిన కాంగ్రెస్ ప్రభుత్వం బేషరతుగా క్షమాపణ చెప్పాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 11 దఫాలుగా అత్యంత పారదర్శకంగా రైతులకు రైతుబంధు డబ్బులు వేశామని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వంలో అది లోపించిందని విమర్శించారు. శుక్రవారం తెలంగాణ భవన్‌లో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, సీనియర్ నేత మహేశ్వర్‌రెడ్డి తదితరులతో కలిసి నిరంజన్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. 'ఎన్నికల సమయంలో రైతులను కాంగ్రెస్ మోసం చేసింది. ఎన్నికలు అయిపోగానే ఏర్పడేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ప్రభుత్వం ఏర్పాటు కాగానే డిసెంబర్ 9 నుంచి రైతుబంధును ఎకరానికి రూ.15 వేల చొప్పున వేస్తామని ఆ పార్టీ నేతలు ప్రకటించారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ఇస్తామని చెప్పారు. వాళ్ల ప్రభుత్వం ఏర్పడి 27 రోజులు అవుతున్నా ఇంకా వాటి ఊసేలేదు. రైతుల కష్టాలు తెలిసిన బీఆర్ఎస్ ప్రభుత్వం బాధ్యతగా రైతుబంధుకు నిధులు సేకరించి, రైతులకు వేయాలని సిద్ధపడితే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది కాంగ్రెస్ పార్టీ కాదా? మేం సిద్ధం చేసిన సొమ్మును ప్రభుత్వం ఏర్పడగానే ఇవ్వాల్సిందిపోయి కాలయాపన చేయటంలో ఆంతర్యం ఏమిటి? ఆ నిధులు ఎక్కడికి పోయాయి? ఇప్పటివరకు ఒక్క ఎకరం ఉన్న రైతులకు కూడా రైతుబంధు పడలేదు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం 11 దఫాల్లో రూ.72,815 కోట్లను రైతులకు రైతుబంధు రూపంలో అందించిందని గుర్తుచేశారు. ఎంతమందికి రైతుబంధు వేశాం? ఎన్ని ఎకరాలలోపు వారికి ఇచ్చాం? అనేది వ్యవసాయశాఖ నుంచి ఏ రోజుకు ఆ రోజు అన్ని వివరాలను అందించామని, ఇప్పుడు ఆ పారదర్శక ఏది? అని ప్రశ్నించారు.

మేధావుల నోళ్లకు ఇప్పుడేమైంది?

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎక్కడో ఒకచోట చిన్న పొరపాటు జరిగినా ఒంటికాలిపై లేచిన కొంతమంది మేధావులు ఇప్పుడు రైతుల సమస్యలపై ఎందుకు మాట్లాడటంలేదని నిరంజన్‌రెడ్డి ప్రశ్నించారు. రైతులంతా పెట్టుబడిసాయం కోసం ఎదురుచూస్తుంటే, కుంటిసాకులతో కాలయాపన చేస్తున్న ఈ సర్కారును ఎందుకు ప్రశ్నించటం లేదని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేయటమే కాకుండా అవమానించిందని మండిపడ్డారు. ఇందుకు ప్రభుత్వం బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ధాన్యానికి కనీస మద్దతు ధరతోపాటు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పిన కాంగ్రెస్, ఎంతమంది రైతులకు బోనస్ ఇచ్చిందని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పటయ్యాక నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయని విమర్శించారు. ప్రజలకు సన్న బియ్యం ఇస్తామని చెప్పిన ప్రభుత్వం, మార్కెట్‌లో ధరలను నియంత్రించటంలో విఫలమైందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్‌పై కక్షసాధించాలనే కుతూహలాన్ని మానిపాలనపై దృష్టిసారించాలని సూచించారు.

శుక్రవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ నిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి

బీఆర్ఎస్‌ది బాధ్యత, కాంగ్రెస్‌ది బాధ్యతారాహిత్యం

బీఆర్ఎస్ బాధ్యతగల పార్టీ అయితే కాంగ్రెస్ బాధ్యతారాహిత్య పార్టీ అని ఎమ్మెల్సీ మధుసూదనాచారి విమర్శించారు. నమ్మి ఓటేసిన ప్రజలను ఆ పార్టీ ఇబ్బందులకు గురిచేస్తున్నదని ఆరోపించారు. బీఆర్ఎస్ కార్యకర్తలు అసెంబ్లీ ఎన్నికల ఓటమి నుంచి తేరుకొని లోక్‌సభ ఎన్నికల్లో గెలుపు కోసం తిరిగి సన్నద్ధం అవుతున్నారని సమీక్షా సమావేశాలు స్పష్టమైన సంకేతాలు ఇస్తున్నాయని పేర్కొన్నారు. పార్లమెంట్ సెగ్మెంట్లవారీగా నిర్వహిస్తున్న సమీక్షల్లో పార్టీ శ్రేణులు విలువైన సూచనలు చేస్తున్నాయని తెలిపారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ముందుకు పోతామన్నారు.

బీఆర్ఎస్‌తోనే తెలంగాణ ప్రజలు: రంజిత్‌రెడ్డి

పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీదే ఘన విజయమని చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో చేవెళ్ల లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో బీఆర్ఎస్ పార్టీకి లక్షకు పైగా ఓట్ల మెజారిటీ వచ్చిందని తెలిపారు. పార్లమెంట్‌లో తెలంగాణ వాదం వినిపించే ఏకైక పార్టీ బీఆర్ఎస్ అని పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ అజెండాతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు, కాంగ్రెస్‌కు 1.85 శాతం ఓట్లు మాత్రమే తేడా ఉన్నదని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తమకు ఒక పాఠం లాంటిదన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన 6 గ్యారెంటీలను అమలు చేయడానికి కనీసం వంద రోజుల సమయం ఇవ్వాలని భావించామని, ప్రభుత్వం వాటిని అమలు చేయడం మాని బీఆర్ఎస్‌పై బురదజల్లటమే పనిగా పెట్టుకోవటంతో తాము మాట్లాడాల్సి వస్తున్నదని తెలిపారు.

420 హామీల అమలుపై ఉలికిపాటెందుకు?

హామీలు గుదిబండలయ్యాయని భయం • సర్కార్‌పై ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఫైర్

సూర్యాపేట, జనవరి 5 (నమస్తే తెలంగాణ) : అధికారంలోకి రావాలనే అత్యాశతో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు ప్రభుత్వానికి గుదిబండలయ్యాయని కాంగ్రెస్ పార్టీకి భయం పట్టుకున్నదని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి అన్నారు. ఇచ్చిన 420 హామీలను అమలు చేయాలంటే ఉలికిపాటు ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వం నడపడం చేతగాక బీఆర్ఎస్ పార్టీ గుర్తింపు రద్దు చేయాలని పిచ్చిపిచ్చి ఉత్తరాలు రాయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ లేకపోతే హామీల అమలుపై నిలదీసే వారుండరని కాంగ్రెస్ భ్రమపడుతుందని విమర్శించారు. శుక్రవారం ఆయన సూర్యాపేటలో మీడియాతో మాట్లాడారు. అధికారంలోకి వచ్చే నమ్మకం లేక కాంగ్రెస్ పార్టీ ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చిందని తాము ఎన్నికల సమయంలోనే చెప్పిన విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం వల్లే సంక్షేమ పథకాలు అమలు కావడం లేదని ప్రజలు మదనపడుతున్నారని అన్నారు. రైతుబంధు ఏ పద్ధతిలో ఇస్తారో ఇప్పటికీ ప్రకటించలేదని మండిపడ్డారు. 'కాంగ్రెస్ వచ్చింది.. కరెంటు పోయింది' అని ప్రజలు ఇప్పటికే చర్చించుకుంటున్నారని తెలిపారు. గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు ఇస్తామన్న కాంగ్రెస్ ఆ హామీని అటకెక్కించి ప్రజల నుంచి ముక్కు పిండి బిల్లులు వసూలు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిపాలన చేత కాకపోతే అనుభవజ్ఞుల సహాయం తీసుకొని ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని జగదీశ్‌రెడ్డి డిమాండ్ చేశారు.

ఆటో డ్రైవర్ సతీశ్‌గౌడ్ ఆత్మహత్యతో విషాదంలో కుటుంబ సభ్యులు

ఆటో డ్రైవర్ ఆత్మహత్య

మొదటిపేజీ తరువాయి...

ఉద్యోగం చూసుకోవాలని కుటుంబ సభ్యులతో కొన్ని రోజులుగా చర్చించాడు. వేరే ఉద్యోగం దొరుకుతుందో లేదో అని మధనపడ్డాడు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. జిమ్‌లో శిక్షకుడైన సతీశ్ సోదరుడు వెంకటేశ్‌గౌడ్ ఫిర్యాదు చేయడంతో పంజాగుట్ట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

విషాదంలో కుటుంబం

సతీశ్‌గౌడ్ 15 ఏండ్లుగా ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడని, రోజుకు 1,500 నుంచి 2 వేల వరకు సంపాదించేవాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆటో ద్వారా సంపాదించిన డబ్బులతో చెల్లె పెండ్లి కూడా చేశాడని వెల్లడించారు. ప్రస్తుత ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం ప్రవేశపెట్టడంతో పదిహేను రోజులుగా సతీశ్‌గౌడ్ గిరాకీలేక డీలా పడిపోయాడని, రోజుకు 300 నుంచి 400 మించి రాకపోవడంతో ఇంటి కిరాయి, తల్లి, కుటుంబ పోషణ భారంగా మారి మనస్తాపానికి గురయ్యాడని తెలిపారు. సొంత ఇల్లు కట్టుకొని, పెండ్లి చేసుకొని తల్లిని, తమ్ముళ్లను బాగా చూసుకుందామని సతీశ్‌గౌడ్ కన్నకలలు కల్లలైపోయాయని ఆవేదన చెందారు. చివరికి ఆటోను అమ్ముకొని ఏదైనా ఉద్యోగం చేద్దామని అనుకున్నాడని, కానీ 35 ఏండ్ల వయస్సులో ఏం ఉద్యోగం చేయాలన్న మానసిక సంఘర్షణ తట్టుకోలేక తనువు చాలించాడని కన్నీరుమున్నీరయ్యారు. తమ కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయామని రోదించారు. రాష్ట్ర ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని వేడుకొన్నారు.

నేడు పెద్దపల్లి సమావేశం

హైదరాబాద్, జనవరి 5 (నమస్తే తెలంగాణ): తెలంగాణ భవన్‌లో శనివారం పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించనున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, కడియం శ్రీహరి, గంగుల కమలాకర్, ఎంపీ వెంకటేశ్ నేత, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ సహా పార్టీ శ్రేణులు ఈ సమావేశానికి హాజరు కానున్నారు.

అదనపు కలెక్టర్ అరుణశ్రీకి వినతిపత్రం అందజేస్తున్న దళితబంధు సాధన సమితి నాయకులు

దళితబంధు నిధులు ఖాతాల్లో జమ చేయాలి

పెద్దపల్లి కలెక్టర్‌కు లబ్ధిదారుల వినతి

పెద్దపల్లి, జనవరి 5: కేసీఆర్ సర్కార్ మంజూరు చేసిన దళితబంధు నిధులను వెంటనే విడుదల చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు. ఈ మేరకు పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గ దళితబంధు సాధన సమితి అధ్యక్షుడు కన్నారి శ్రీశైలం ఆధ్వర్యంలో లబ్ధిదారులు శుక్రవారం కలెక్టర్‌కు తమ గోడు వెల్లబోసుకున్నారు. మంథని నియోజకవర్గంలోని మంథని, ముత్తారం, కమాన్‌పూర్, రామగిరి మండలాలకు చెందిన పలువురు దళితులను రెండో విడత దళితబంధు పథకం కింద ఎంపిక చేశారని వారు తెలిపారు. ఎంపీడీవో, గ్రామ పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారుల నుంచి వాటికి సంబంధించిన అన్ని పత్రాలు తీసుకొని పరిశీలన చేసి దళితబంధు పోర్టల్‌లో పేర్లను నమోదు చేశారని, బ్యాంకులో కూడా దళితబంధు జీరో అకౌంట్ తీయించారని గుర్తు చేశారు. మంజూరైన నిధులు అసెంబ్లీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో కలెక్టర్ అకౌంట్‌లో రూ.26.45 కోట్లు జమ చేశారని, ఆ నిధులను విడుదల చేసి తమను ఆదుకోవాలని వారు కోరారు. తర్వాత కలెక్టర్ సూచన మేరకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే అరుణశ్రీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం కన్నారి శ్రీశైలం మీడియాతో మాట్లాడుతూ, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చొరవ తీసుకొని నిధులు మంజూరయ్యేలా చూడాలని కోరారు.

పథకాల రద్దుపై రణం

మొదటిపేజీ తరువాయి...

కేటీఆర్, హరీశ్‌రావు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరును విమర్శించారు. గత ప్రభుత్వ పథకాల రద్దుపై నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రభుత్వం అందించిన అధికారిక పత్రాలతో లబ్ధిదారులు కోర్టును ఆశ్రయించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ప్రజల ప్రయోజనాలకు లబ్ధి కలిగించే ఏ కార్యక్రమాన్ని వ్యతిరేకించినా, రద్దు చేసినా ప్రజల తరపున బీఆర్ఎస్ నిలబడుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నా, ఏ పార్టీ ఉన్నా, ప్రభుత్వం అనే వ్యవస్థ శాశ్వతం అనే విషయాన్ని గుర్తుంచుకోవాలని చెప్పారు. ప్రభుత్వ కార్యక్రమాలతో పాటు గత ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు, నిధులు ఇచ్చిన రోడ్లు, భవనాలు వంటి ప్రజా ప్రయోజన మౌలిక వసతులనూ రద్దు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే గృహలక్ష్మి పథకాన్ని రద్దు చేస్తూ జీవో ఇచ్చిందని, లబ్ధిదారుల ఎంపిక పూర్తయ్యి అధికారిక పత్రాలు అందుకున్నవారి పరిస్థితి ఏమిటో స్పష్టం చేయాలని కాంగ్రెస్ సర్కారును డిమాండ్ చేశారు. గొర్రెల పంపిణీ ద్వారా లక్ష మంది యాదవుల కుటుంబాల్లో ఆర్థిక భరోసా కలిగిందని, ఇలాంటి కార్యక్రమాన్ని కూడా రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నం చేస్తున్నదని అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఈ పథకంలో భాగంగా తమ వాటాగా డీడీలు కట్టిన వారికి వెంటనే గొర్రెలను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. దళితబంధు పథకాన్ని కూడా రద్దు చేయాలని ఆలోచిస్తున్నదని, రూ.12 లక్షలు ఇస్తామన్న హామీనికి కాంగ్రెస్ కట్టుబడి ఉండాలని అన్నారు. ఈ పథకం కింద ఎంపికైన వారికి తక్షణమే నిధులు మంజూరు చేసి, యూనిట్లు ప్రారంభం అయ్యేలా చూడాలని చెప్పారు.

బలహీనవర్గాలకు కాంగ్రెస్ ద్రోహం

పేదలకు మేలు చేసే గృహలక్ష్మిని రద్దు చేసిన కాంగ్రెస్ సర్కారు.. దళితబంధు, గొర్రెల పంపిణీని రద్దు చేయాలని చూడటం ఆయా సామాజిక వర్గాలకు తీరని అన్యాయం చేసినట్లేనని కేటీఆర్, హరీశ్‌రావు ధ్వజమెత్తారు. ప్రతి సంక్షేమ కార్యక్రమాన్ని రద్దు చేసి రాష్ట్ర ప్రజలకు అధికార పార్టీ తీరని ద్రోహం చేస్తున్నదని మండిపడ్డారు. ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలకు వ్యతిరేకంగా అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో లబ్ధిదారులకు అండగా పార్టీ తరపున నిరసనలు చేపడతామని తెలిపారు. పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీలు ఈ నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పట్టణాలు, గ్రామాలకు గత ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి కార్యక్రమాలను కూడా ఈ ప్రభుత్వం రద్దు చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలు, టీయూఎఫ్ఐడీసీ, ఇతర సంస్థల ద్వారా అందించిన నిధులను రద్దు చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్లు, భవనాలు, ఇతర పౌర వసతుల కార్యక్రమాలు ప్రారంభం కావాల్సి ఉన్న నేపథ్యంలో వీటిని రద్దు చేయడం దుర్మార్గమని మండిపడ్డారు. పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బీ రోడ్ల మంజూరును కూడా రద్దు చేసేందుకు ప్రయత్నం చేస్తున్నదన్నారు. ప్రజలను చైతన్యవంతులను చేసి కాంగ్రెస్ సర్కారుపై పోరాడాలని ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌చార్జీలకు దిశానిర్దేశం చేశారు.

మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన ఫణి, జున్ను, తల్లీబిడ్డ సునీత, మోక్ష, జశ్వంత్ (ఫైల్)

హైవేపై బీభత్సం

మొదటిపేజీ తరువాయి...

దూసుకెళ్లింది. దీంతో మృతదేహాలు చెల్లాచెదురుగా పడిపోయాయి. ఆగ్రహం వ్యక్తం చేసిన స్థానికులు పోలీసులపై దాడి చేశారు. మూడు గంటలపాటు జాతీయ రహదారి-44పై బైఠాయించడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. బాలానగర్‌లో శుక్రవారం అంగడి ఉండటంతో మోతిఘనపూర్, బీబీనగర్‌తోపాటు పలు గ్రామాలు, తండా వాసులతోపాటు బీహార్‌కు చెందిన కూలీలు సైతం వచ్చారు. కూరగాయలతోపాటు ఇతర వస్తువులను కొనుగోలు చేసి తిరుగు ప్రయాణమవుతుండగా సాయంత్రం 5:30 గంటలకు హైదరాబాద్ నుంచి జడ్చర్ల వైపు టైర్ల లోడ్‌తో వేగంగా వెళ్తున్న డీసీఎం వాహనం అదుపుతప్పి బాలానగర్ చౌరస్తా వద్ద రోడ్డు దాడుతున్న బైక్‌తోపాటు మరో ఐదుగురిని, అప్పటికీ కంట్రోల్ కాకపోవడంతో ముందు వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరితోపాటు రోడ్డు దాటుతున్న ఐదుగురికి గాయాలయ్యాయి. వీరిలో బీబీనగర్ తండాకు చెందిన జున్ను(3), ఫణి (50), మోతిఘనపూర్‌కు చెందిన తల్లీబిడ్డలు మోక్ష(8), సునీత(32), బాలానగర్‌కు చెందిన జశ్వంత్(10) అక్కడిక్కడే మృతి చెందారు. మధ్యప్రదేశ్‌కు చెందిన భద్రాసింగ్, బీబీనగర్ తండాకు చెందిన మౌనిక తీవ్రంగా గాయపడగా.. మౌనికను మహబూబ్‌నగర్ జిల్లా ప్రభుత్వ దవాఖానకు, భద్రాసింగ్‌ను హైదరాబాద్‌లోని ఉస్మానియాకు తరలించారు. క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను కలెక్టర్ రవినాయక్ ఆదేశించారు. డీసీఎం వాహనాన్ని వది